క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ పరిధిలో పలు 11కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పెద్దమ్మగడ్డ సబ్ స్టేషన్‌లోని 11కేవీ పరిధిలోని పెద్దమ్మగడ్డ, అక్షర కాలనీ, జ్యోతిబసునగర్, డ్రీమ్‌ల్యాండ్ ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ సాంబరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, రంగశాయిపేట 11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని భద్రకాళి దేవాలయం, బల్దియా కార్యాలయం, రంగంపేట, ఎంజీఎం క్రాస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. మడికొండ సబ్ స్టేషన్ పరిధిలోని మడికొండ, రాట్టిబండ, టెక్ మహీంద్ర, తెలంగాణ పేపర్స్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

సంస్థ ఆస్తులను విక్రయించొద్దు

నయీంనగర్: హనుమకొండ మిషన్ ఆస్పత్రిని ఆనుకొని ఉన్న క్రైస్తవ సమాజానికి సంబంధించిన (బాప్టిస్ట్ సంస్థ) ఆస్తులను ఎవరూ అమ్మకూడదు, కొనకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని హనుమకొండ కొల సమాజం ప్రాపర్టీ చైర్మన్ పుల్లూరి మార్టిన్ లూతర్ గుర్తుచేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ ఆస్తులకు సంబంధించిన కేసులు సుప్రీం కోర్టు, మద్రాసు కోర్టుల్లో నడుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కొల సమాజం బాధ్యులు దామెర జేమ్స్, జన్ను ప్రసన్న, మేకల డేనియల్, తీగల మోహన్, అరుణ్ జేమ్స్, సత్తయ్య, దేవానందం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కాశిబుగ్గ: టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో పాల వ్యాపారి తీవ్ర గాయాలు కాగా, ట్రాక్టర్ డ్రైవర్ సైతం గాయపడ్డాడు. ఈ ఘటన వరంగల్ – నర్సంపేట ప్రధాన రహదారి లేబర్‌కాలనీలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గీసుకొండ కోనాయమాకులకు చెందిన శంకర్‌రావు.. 18వ డివిజన్ శాలినినగర్‌లో పాలు పోసి తన టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై తిరిగి వెళ్తుండగా వరంగల్ నుంచి గొర్రెకుంట గోదాం వైపు వెళ్తున్న నూతన ట్రాక్టర్ ఢీకొట్టింది. దాంతో శంకర్‌రావుకు తీవ్రగాయాలు కాగా, 108 అంబులెన్స్ వాహనంలో స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



హన్మకొండ చౌరస్తా: సంగీత దర్శకుడు హనుమకొండ భిక్షపతి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని హనుమకొండ పెద్దమ్మగడ్డలోని స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ తన పుట్టిన రోజును వృద్ధాశ్రమంలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కన్నె రాజు, రాజేందర్, దప్పు శ్రీకాంత్, శివ, ప్రణయ్, సందీప్, నరేష్, రమేష్, పవర్, కార్తీక్, జలపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి



విద్యారణ్యపురి: కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ కోరారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన నేరెల్లి రాముకు హనుమకొండలోని విద్యా ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు సోమవారం రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ పదేళ్ల క్రితం కండరాల క్షీణత వ్యాధికి గురైన రాము.. పూర్తిగా వీల్‌చైర్‌కు పరిమితమయ్యారని తెలిపారు. ఈక్రమంలో అతడికి సాయం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు గురజాల తిరుపతిరెడ్డి, సభ్యులు లీల, గురిజాల శశికళ, రాపాక సోమయ్య, మహేశ్వరపు నరేందర్‌రెడ్డి, ఉదయశ్రీ, ప్రభాకర్, చింతల కమల, సోమయ్య పాల్గొన్నారు.

చెరువు చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మించాలి

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురం చెరువు రక్షణకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని వివేకానగర్ కాలనీవాసులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం చెరువు కట్ట బలహీనంగా ఉందని పేర్కొన్నారు. గతేడాది కట్టకు గండి పడడంతో తాత్కాలికంగా ఇసుక బస్తాలతో మూసివేసినట్లు తెలిపారు. భారీ వర్షాలకు కట్టకు మళ్లీ గండి పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని కోరారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

- పత్తి విత్తనాలకు కృత్రిమ కొరత
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు
- అధికారులు తనిఖీలు చేసినా మారని వ్యాపారుల తీరు



ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో దుక్కి దున్నుతున్న రైతు

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటల సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. పలు రకాల విత్తనాల కోసం షాపుల వద్దకు పరుగులు పెడుతున్నారు. మార్కెట్లో పత్తి విత్తనాలకు డిమాండ్ ఉండటంతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వర్షాలు అనుకూలంగా ఉండడంతో బ్లాక్ మార్కెట్లో ధర కాస్త ఎక్కువైనా పత్తి విత్తనాలను పలువురు కొనుగోలు చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ పర్యవేక్షిస్తున్నా..

విత్తనాల కొరత లేకుండా వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ సకాలంలోనే అందుబాటులో ఉంచుతోంది. డిమాండ్ ఉన్న పత్తి ప్యాకెట్లకు వ్యాపారులు నో స్టాక్ బోర్డులు పెట్టి రహస్య ప్రదేశాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

4.5లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 4.50లక్షల ఎకరాలకు పైగా ఖరీఫ్ సాగవుతుందని వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. అందుకనుగుణంగా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచింది. జిల్లాలో పత్తి, వరి, కంది, మొక్కజొన్న, పెసరు పంటల సాగు విస్తీర్ణం అధికంగా ఉంటుంది. చాలా మంది రైతులు రోహిణిలో,మరికొంత మంది మృగశిర కార్తెల్లో కురిసిన వర్షాలకు విత్తనాలు విత్తుతున్నారు. 30 సెంటి మీటర్ల మేర భూ ఉపరితలం తడిసి వేడి తగ్గిన తర్వాతే పంటలు సాగు చేయాలని అధికారులు సూచించారు. అయితే రైతులు అవేమీ పట్టించుకోకుండా మొదటి వర్షానికే పత్తి విత్తనాలు విత్తుకున్నారు. గతేడాది వర్షాలు లేక రెండు, మూడు సార్లు పత్తి విత్తనాలు విత్తారు.



చెన్నారావుపేట మండలంలో పత్తి గింజలు విత్తుతున్న కూలీలు

విత్తనాలకు కృత్రిమ కొరత

విత్తనాల కృత్రిమ కొరత పేరిట రైతులను వ్యాపారులు దోచుకుంటున్నారు. జిల్లాలోని 13 మండల కేంద్రాల్లో పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సదరు వ్యాపారులను నియంత్రించడం, టాస్క్‌ఫోర్స్ కమిటీలతో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నా వారిలో ఎలాంటి జంకు లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బిల్లులు సరైనవేనా?

జిల్లాలో పత్తి సాగు ఎక్కువ. దాంతో మార్కెట్లో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు అందుబాటులో లేవని చెబుతూ బ్లాక్ మార్కెట్‌లో దొంగచాటుగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పత్తి విత్తన సంచులను రూ.864లకు మాత్రమే విక్రయించాలని ప్రభుత్వం ఆదేశించినా అంతకు మించి ఎక్కువ ధరలకు విక్రయిస్తూ రైతులను వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. అయితే వ్యాపారులు ఇచ్చే బిల్లులు సరైనవే అనే అనుమానాలు కలుగుతున్నాయి. సరైన బిల్లు కోసం కావాలని రైతులు కోరితే, అందుకు అదనంగా జీఎస్టీ కట్టాల్సి ఉంటుందని, ఈక్రమంలో బిల్లు ఇవ్వడం లేదని వ్యాపారులు తెగేసి చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



విత్తన షాపుల్లో సరిపడా వరి, పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. నాసిరకం విత్తనాలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ పరంగా జీలుగకు తప్ప ఇతర వాటికి రాయితీ లేదు. అనుమతి ఉన్న షాపుల్లోనే వరి సన్న రకాలతో పాటు పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే సదరు వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– విజ్ఞాన్, మండల వ్యవసాయ అధికారి

ఎన్‌సీసీతో దేశభక్తి పెంపొందుతుంది



కేడెట్లతో కమాండెంట్ రవీంద్రకుమార్ రవి



నృత్యం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

మామునూరు: ఎన్‌సీసీ శిక్షణతోనే దేశభక్తి, క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ వరంగల్ కమాండెంట్ రవీంద్రకుమార్ రవి అన్నారు. ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ వరంగల్ డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకరన్ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో ఈనెల 1నుంచి జరుగుతున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరం సోమవారం సాయంత్రం ముగిసింది. ముఖ్యఅతిథిగా రవీంద్రకుమార్ రవి హాజరై ఉత్తమ కేడెట్లకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ ద్వారా నిస్వార్థ సేవ చేయాలనే ఆశయాలతోపాటు వ్యక్తిత్వం, ధైర్యం, సహృదయత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, లౌకిక దృక్పథం, సాహసం, క్రీడాస్ఫూర్తి వంటి లక్షణాలు పెంపొందుతాయని వివరించారు. ఏ, బీ, సీ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని అన్నారు. అనంతరం బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ట్రెనింగ్ అధికారులు ధర్మారావు, రమణారావు, సుజితాదేవి, స్వప్న, శ్రీనివాస్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

పెంచిన పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని వినతి



రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పరిశోధకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని పలువురు పరిశోధక విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి సోమవారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌డీ టైటిల్ చేంజ్ ఫీజు తగ్గించాలని, ఫెల్లోషిప్స్ కలిగిన పరిశోధకులకు హానరోరియం క్లాసెస్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ కళ్లెపల్లి ప్రశాంత్, సుమన్, జానకి రాములు, సతీష్, శ్రీకాంత్, వెంకన్న, రాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో సోమవారం బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేశారు. పోలీసులు, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య అక్కడి చేరుకుని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో మాట్లాడారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో వారు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన విరమించారు.

దత్తత కథనాలపై కదలిక

- 'సాక్షి'లో ప్రచురితమైన కథనాల ఆధారంగా విచారణ
- కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలతో విచారణ బృందం ఏర్పాటు



విచారణ చేస్తున్న బృందం సభ్యులు



సాక్షిలో ప్రచురించిన కథనాలు

సాక్షి స్పందన

సాక్షి, వరంగల్: పిల్లలు కావాలంటూ చట్టబద్ధత ప్రకారం దరఖాస్తు చేసుకున్న పిల్లలు లేని దంపతులు వరంగల్ జిల్లా బాలల సంరక్షణ దత్తత విభాగాధికారుల తీరుతో ఇబ్బందులు తప్పడం లేదని సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలపై కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. ఆమె ఆదేశాలతో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ 'నిబంధనలు బేఖాతరు', 'దత్తతలో దందా' కథనాలపై సోమవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు రాయపర్తి మండలంలోని మురుపోజు రాంబాబు, సవిత, వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేటకు చెందిన బొమ్మిడి నర్సయ్య దంపతుల ఇళ్ల వద్దకు వెళ్లి దత్తతకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. అసలు ఎక్కడ తప్పు జరిగిందనే విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. దత్తతలో ముందువరుసలో ఉన్నామని, రీవ్యాలిడేషన్‌కు రిక్వెస్ట్ పెట్టుకున్నా హోం స్టడీ చేయకపోవడంతో సీనియారిటీ కోల్పోయామని, అసలు తమకు పిల్లలే వద్దన్నట్లుగా ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) కి ఎలా మెయిల్ పంపుతారని, కనీసం తమ ఇంటికి రాకుండానే విచారణ నివేదిక ఎలా సమర్పిస్తారని రాంబాబు దంపతులు బృందం సభ్యులను ప్రశ్నించినట్లు సమాచారం.

ప్రతీసారి రూ.500 ఇస్తున్నాం..

వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మిడి నర్సయ్య దంపతులు రీవ్యాలిడేషన్‌కు హనుమకొండ బాలల పరిరక్షణ విభాగానికి చెందిన ఓ అధికారికి రూ.ఆరు వేలు ఇచ్చామని, నెలలో రెండుసార్లు లాగిన్ ఐడీ, పాస్ వర్డ్ ఓపెన్ చేసి స్టేటస్ తెలుసుకునేందుకు వచ్చిన ప్రతీసారి రూ.500లు గత మూడున్నరేళ్లుగా ఇస్తూ వస్తున్నామని వెల్లడించినట్లు తెలిసింది. పిల్లలు లేని ఈ దంపతులు మరోసారి లిఖితపూర్వకంగా ఈ బృందానికి రాసిచ్చినట్లు సమాచారం. 'దత్తత అక్రమాలపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ రాయపర్తి, దమ్మన్నపేటలో సోమవారం పర్యటించింది. బాధితులతో మాట్లాడడమే కాకుండా లిఖితపూర్వకంగా వివరాలు తీసుకుంది. దీనిపై నివేదికను సిద్ధం చేసి కలెక్టర్ ప్రావీణ్యకు సమర్పిస్తామని, సదరు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని జిల్లా సంక్షేమ విభాగాధికారి హైమావతి తెలిపారు.

ఈద్గా అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఈద్గా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ముస్లిం, మైనార్టీ నేత, ఈద్గా ప్రతినిధి ఎంఏ.జబ్బార్ కోరారు. ఈ మేరకు హనుమకొండ రాంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖను సోమవారం కలిసి ఈద్గా అభివృద్ధి, బక్రీద్ ఏర్పాట్లుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం జబ్బార్ మాట్లాడుతూ ఈద్గాలోని ప్రార్థన స్థలం రోడ్డుకు దిగువన ఉందని, మోరం పోసి ఎత్తు పెంచి అభివృద్ధి చేయాలని, మీనార్లు నిర్మించాలని, బక్రీద్ పండగకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం బక్రీద్ పర్వదినాన ఈద్గాకు రావాలని మంత్రి సురేఖ ఆహ్వానిస్తూ పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఎండీ.చాంద్‌పాషా, ఎండీ.అమ్జద్, హసన్ అలీ, ముగ్దుం, అశ్రఫ్, మాషూక్, జాకీర్, సలీం, షర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులకు అభినందనలు



బండి సంజయ్‌కు బొకే అందజేస్తున్న రమేష్, ప్రదీప్‌రావు, తదితరులు



కిషన్‌రెడ్డితో అరూరి

కాశిబుగ్గ: కేంద్ర మంత్రులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు బీజేపీ నేతలు అభినందనలు తెలిపారు. వారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మల్కాజీగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఢిల్లీలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి బొకేలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కనుకుంట్ల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన అరూరి రమేష్

కాజీపేట అర్బన్: కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన అమిత్‌షా, బండి సంజయ్, కిషన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఖిలా వరంగల్: కరీమాబాద్‌లో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కార్పొరేటర్



మడికొండ: ఎస్సీ కాలనీలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

ఖిలా వరంగల్: ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో కరీమాబాద్ శ్రీవెంకటేశ్వర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్యాల సోమశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల మంచి భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో కోటేశ్వర్, బండారి సదానందం, యాదగిరి, నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మడికొండలో బడిబాట

మడికొండ: మడికొండలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ఎస్సీ కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ బడుల్లో వేలకు వేల రూపాయలు ఖర్చుచేసేకంటే అన్ని వసతులను ఉచితంగా సమకూర్చుతున్న ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని చెప్పారు. విశాలమైన క్రీడా మైదానం, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, మన్నె చంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న రాగుల రమేష్

న్యూశాయంపేట: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11 నుంచి జూలై 10వ తేదీ వరకు దశల వారీగా పోరాటాలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో రమేష్ మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడానికి బీజేపీ ప్రభుత్వం పూనుకున్నదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వర్తించే రిజర్వేషన్లు రద్దు చేస్తామని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తామని ఇటీవల ఎన్నికల సభల్లో ప్రధాని మోదీ బహిరంగంగానే తెలిపారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.ఉప్పలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు యాస బాబు, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నరేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఇమ్మడి సాగర్, అనిల్, అశోక్, శ్రీలత, సభ్యులు కోర్నెల్, సువర్ణ, పార్వతి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖిలా వరంగల్ మండల కార్యాలయం ఎదుట పార్టీ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగిలిన ఏఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని, కౌలు రైతులకు చేసిన వాగ్దానాలు, కార్మికుల ఏడాదికి రూ.12 వేలు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, అర్హులకు ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రాయినేని ఐలయ్య, నల్గొండ రవి, ప్రభాకర్, నరసయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.